www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 17 | మార్చి | 2026
పేజీలు : 8

### ఫోటో దిగుతూ
## మహిళ మృతి

ప్రజాపక్షం/ ఖమ్మం : ఫోటో దిగుతూ గుండెపోటుకు గురై మహిళ మృతి చెందిన ఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బొమ్మ సుస్మిత గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. సోమవారం ఖమ్మం నగరంలోని గాంధీచౌక్‌లో ఓ గృహప్రవేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆమె ఫోటో దిగుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన ఖమ్మంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

### రూ. 1.86 కోట్లకు
## ఐపి దాఖలు

ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ : ఓ ప్రైవేటు చిట్టి వ్యాపారి రూ.1,86,70,000లకు స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపి దాఖలు చేశారు. కేసులో మొత్తం 51 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. చిట్టి వ్యాపారంలో ఒడుదొడుకులు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని అప్పులు తీర్చే పరిస్థితి లేదని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నాడు. తనను దివాళాదారునిగా ప్రకటించాలని ఆయన తన న్యాయవాది ద్వారా పిటిషన్ దాఖలు చేశారు.






# సారూ.. స్పందించరేమి..!?

- గాడి తప్పిన విద్యా వ్యవస్థ
- కాసుల వేటలో కార్పోరేట్
- నిర్లక్ష్యం నీడలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ

విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుంది. లక్షలాది మంది విద్యార్థుల భవితవ్యంతో కూడిన విషయాలపైన విద్యాశాఖ తగు రీతిలో స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శల వ్యక్తమవుతున్నాయి. విద్యా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. కాసుల వేటలో ప్రైవేటు విద్యా సంస్థలు, కార్పోరేట్ సంస్థలు ఉండగా ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్లక్ష్యం అవహించింది. విద్యా వ్యవస్థను గాడిన పెట్టాల్సిన అధికార యంత్రాంగం చేష్టలూడిగి చూస్తుండిపోతుంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను సరిదిద్దే ప్రయత్నం కానీ ప్రైవేటు విద్యా వ్యవస్థను నియంత్రించే ప్రయత్నం కానీ చేయడం లేదు.

2లో

-ప్రజాపక్షం/ఖమ్మం

## సామాన్యులపై ధరాఘాతం



- మోడీ తీరే ధరల పెరుగుదలకు కారణం
- సిపిఐ నిరసన కార్యక్రమంలో బాగం

2లో

## యుద్ధంతో దేశంలో సంక్లిష్ట పరిస్థితి

- ప్రజలను మభ్యపెడుతున్న కేంద్రం
- మీడియా సమావేశంలో ఎంపి రేణుకాచౌదరి

2లో



## ప్రపంచ శాంతిని విచ్ఛిన్నం చేస్తున్న సామ్రాజ్యవాదులు

- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయేల్‌ది యుద్ధోన్మాదం
- దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న కేంద్రం
- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా
- ఖాళీ సిలెండర్లతో వినూత్న నిరసన



ప్రజాపక్షం/ఖమ్మం : ప్రపంచ శాంతిని సామ్రాజ్యవాదులు విచ్ఛిన్నం చేస్తున్నారని, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయేల్‌ది యుద్ధోన్మాదమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. దేశవ్యాప్త

మిగతా 2లో..

## ప్రత్యేక విద్యావిధానం దివ్యాంగులకు వరం




### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ప్రజాపక్షం/కొణిజర్ల : భవిత కేంద్రంలో ప్రత్యేక విద్యావిధానం దివ్యాంగులకు వరం లాంటిదని ఈ విద్యావిధానంద్వారా దివ్యాంగులైన పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందుతున్నారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మండల కేంద్రం కొణిజర్లలోగల భవిత కేంద్రాన్ని ఆయన

మిగతా 2లో..

# సారూ.. స్పందించరేమి..!?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుంది. లక్షలాది మంది విద్యార్థుల భవితవ్యంతో కూడిన విషయాలపైన విద్యాశాఖ తగు రీతిలో స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. కాసుల వేటలో ప్రైవేటు విద్యా సంస్థలు, కార్పోరేట్ సంస్థలు ఉండగా ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్లక్ష్యం అవహించింది. విద్యా వ్యవస్థను గాడిన పెట్టాల్సిన అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండిపోతుంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను సరిదిద్దే ప్రయత్నం కానీ ప్రైవేటు విద్యా వ్యవస్థను నియంత్రించే ప్రయత్నం కానీ చేయడం లేదు. ప్రైవేటు విద్యా వ్యవస్థకు సంబంధించి పలు సంస్థలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలను నిర్వహించాల్సి ఉండగా 50 శాతం పాఠశాలలు ఆ విషయాన్నే పట్టించుకోవడం లేదు. బహుళ అంతస్తుల్లో పాఠశాలలు నిర్వహించడం, ప్రభుత్వ నిబంధనల మేరకు ఆట స్థలాలు లేకపోవడం విద్యా శాఖాధికారులకు తెలియందికాదు. ఇదే సందర్భంలో పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య ఆయా పాఠశాలల స్థాయిని బట్టి బోధన సిబ్బందిని నియమించాలి. కానీ అర్హత కలిగిన సిబ్బంది కేవలం అధికారులకు ఇచ్చే జాబితాలో మాత్రమే ఉంటుండగా బోధనకు మాత్రం వారు చాలా దూరంగా ఉంటున్నారు. ఒక్కరి పేరే పలు విద్యా సంస్థల్లోని బోధన సిబ్బంది జాబితాలో చోటు చేసుకుంటుందని అర్హత లేని వారిచే బోధనలు సాగిస్తున్నారని ఇందుకు వేతనాల చెల్లింపు కారణమన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం నగరంలోని ప్రైవేటు విద్యా సంస్థల గురించే పట్టించుకునే స్థితిలో ఖమ్మం విద్యాశాఖ లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించుకోవచ్చు. ఇక ఫీజులపై నియంత్రణ కరువైంది. విద్యా బోధనను పూర్తిగా వ్యాపార రంగంగా మార్చివేశారు. పొంతన లేనివిధంగా వసూళ్ల పర్వానికి తెర లేపారు. ఇప్పటికీ కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి విద్యా బోధనను సాగిస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాయి. వీరి తీరు అభినందనీయం. కానీ కేవలం కాసుల కోసమే విద్యా సంస్థలను నడుపుతూ నిబంధనలను పట్టించుకోని సంస్థల పట్ల ఎందుకు వివక్ష ప్రదర్శిస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేని పరిస్థితి. ఇప్పుడు ప్రైవేటు విద్యా రంగాన్ని కార్పోరేట్ సంస్థలు శాసిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ విద్యా సంస్థలను నిర్వహిస్తున్న పలు కార్పోరేట్ సంస్థలు హైదరాబాద్ నుంచే జిల్లా విద్యాశాఖాధికారులను నియంత్రిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పై స్థాయిలోనే పైరవీలు నడుస్తుండడంతో కొన్ని సంస్థల విషయంలో జిల్లా అధికారులు చూస్తుండటం తప్ప ఏమి చేయలేని పరిస్థితి. అటువంటి విద్యా సంస్థల వారు ఆడిందే ఆటగా చెప్పిందే పాఠంగా అడిగిందే ఫీజుగా చెల్లుబాటు అవుతుంది. ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేయాలన్న దానిపై చెప్పేది ఒకటి చేసేది ఒకటి అన్న చందంగా తయారైంది. కొన్ని విద్యా సంస్థలు అడ్మిషన్ నాడు ఫీజు విషయాలను అడ్మిషన్ పత్రంపై పెన్సిల్‌తో నమోదు చేసి ఆ తర్వాత హాల్ టికెట్ ఇచ్చేటప్పుడు లేదా తరగతి ముగింపు సమయంలో ఇబ్బందులు పెడుతున్నారని చాలా మంది తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేయాలి, ఏఏ నిబంధనలు పాటించాలో విద్యా సంస్థలకు తెలియజేసి సానుకూలంగా స్పందించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటే తప్ప ప్రైవేటు విద్యా రంగం నియంత్రించబడే అవకాశం లేదు. ప్రభుత్వ విద్యా రంగానికి సంబంధించి ఉపాధ్యాయుల్లో అంకిత భావం కొరవడింది. బిల్లు, బెల్లు, ఉపాధ్యాయుల సంఖ్య పెరిగిపోయింది. గతంలో పాఠశాలకు రాకుండా వచ్చినట్లుగా హాజరు చూపే ఉపాధ్యాయుల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్)ను అమల్లోకి తీసుకు వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల హాజరు శాతం పెరిగిన బోధనలో మాత్రం మార్పు రాలేదు. కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన తర్వాత సొంత వ్యవహారాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. పాఠశాల సమయంలోనే కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాలను ఫోన్ల ద్వారా నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. కేవలం భౌతికంగా పాఠశాలలో ఉన్న బోధన విషయంలో అంకితభావం కొరవడిందని దీనిని పునరుద్ధరించేందుకు నిరంతర పర్యవేక్షణ అవసరమన్న భావన ఉపాధ్యాయుల నుంచే వ్యక్తమవుతుంది. అతి ప్రధానమైన విద్యా రంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయం. ప్రభుత్వ విద్యా రంగాన్ని మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీని నియంత్రించాల్సిన అవసరం ఉన్నది. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివితే తమ పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందన్న భావనను తొలగించేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి. తల్లిదండ్రుల్లోనూ అవగాహన కలిగించడంతో పాటు ప్రజాప్రతినిధులు , ప్రభుత్వ ఉద్యోగులు ఆదర్శంగా నిలిచేందుకు తమ పిల్లలను ప్రభుత్వ బడుల వైపు మళ్లించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు చదువుపై విపరీతంగా వెచ్చిస్తున్నారు. ఎంత ఎక్కువ ఫీజు కడితే మా పిల్లవానికి అంత బాగా చదువు వస్తుందని ఉన్నత స్థాయికి చేరతాడన్న భ్రమలో ఉన్నారు. ఈ భ్రమనే కార్పోరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేసినప్పుడు మాత్రమే ఇటు ప్రభుత్వ విద్యా సంస్థలు పూర్వ వైభవాన్ని సాధించడంతో పాటు ప్రైవేటు విద్యా సంస్థలు నియంత్రించబడతాయి.

# సామాన్యులపై ధరాఘాతం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ట్రంప్ యుద్ధ కాంక్ష భారతదేశంలో సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు క్షీణిస్తున్నాయని ఆయన తెలిపారు. గ్యాస్ సహా ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలియజేశారు. ధరలను తగ్గించాలని కేంద్ర విధానాలే ధరల పెరుగుదలకు కారణమని నినదించారు. ఈ ఆందోళను ఉద్దేశించి హేమంతరావు మాట్లాడుతూ సంపదపై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంపన్న దేశాలపై దాడులు చేసి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆ క్రమంలోనే ఇజ్రాయెల్‌తో చేతులు కలిపి ఇరాన్‌పై దాడులు చేస్తున్నారన్నారు. మోడీ అలీన దేశపు ప్రధానిగా యుద్ధాన్ని నివారించకపోగా యుద్ధం వల్ల ఎదురయ్యే విపత్కర పరిస్థితులను అంచనా వేయడంతో వైఫల్యం చెందారని ఆయన ఆరోపించారు. దిగుమతుల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో వైఫల్యం చెందిన కారణంగానే ధరలు పెరిగాయని హేమంతరావు తెలిపారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించాలన్నారు. ఇతర దేశాలకు ఎగుమతులు చేసే వాటి ధరలు గణనీయంగా తగ్గిపోతున్నాయని ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన తెలిపారు. యుద్ధం ఆగకపోతే రసాయనిక ఎరువుల ధరలు పెరగడంతో పాటు కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ధరల పెరుగుదలతో సామాన్యులు నానా ఇబ్బందులు పడుతున్నారని తక్షణం ధరలను తగ్గించే చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. మోడీ ట్రంప్ ముందు మోకారిల్లుతూ దేశ ప్రజల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, కార్పొరేటర్ బిజి క్లైమెంట్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పుచ్చకాయల సుధాకర్, గాదె లక్ష్మి నారాయణ, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, బానోత్ రాంకోటి, ఎస్‌కె సైదా, మదుపల్లి లక్ష్మణ్, శ్రవణ్, చింతల రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధంతో దేశంలో సంక్లిష్ట పరిస్థితి

**ప్రజాపక్షం/ఖమ్మం :** అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధం నేపథ్యంలో భారతదేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ఆరోపించారు. ఇప్పటికే బిజెపి పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే యుద్ధం తర్వాత దేశ ప్రజల పరిస్థితి గోరుచుట్టుపై రోకలిపోటు మాదిరిగా తయారైందని ఎల్‌పిజి గ్యాస్ ధరలు సహా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని ఆమె ఆరోపించారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రేణుకాచౌదరి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేస్తుందన్నారు. వాస్తవ పరిస్థితులను వివరించడంలో బిజెపి వైఫల్యం చెందిందని, యుద్ధ నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. యుద్ధం ఆగకపోతే దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మరింత తగ్గి రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా తెలంగాణ రైతాంగం సాగు చేస్తున్న సన్నబియ్యం ధరలు మరింత పడిపోనున్నాయని రేణుకాచౌదరి తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో మోడీ గెలుపు కోసం ఆరాటపడుతున్నారు తప్ప ప్రజల గురించి ఆలోచించడం లేదని తక్షణం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పొరుగు దేశాలు యుద్ధ నేపథ్యంలో అప్రమత్తమైతే భారతదేశం ఎందుకు అప్రమత్తం కాలేదని ఆమె ప్రశ్నించారు. పార్లమెంటు సమావేశాల్లో విభజన ఒప్పందాలకు సంబంధించి ప్రభుత్వంపై ఒత్తిడి తేనున్నామన్నారు. విభజన ఒప్పందంలో భాగంగా తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం ఇప్పటికే నోటీసులు ఇచ్చామని ఆమె తెలిపారు. కేంద్రం తెలంగాణ పట్ల ఎందుకు వివక్ష ప్రదర్శిస్తుందో అవగతం కావడం లేదన్నారు. తెలంగాణకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. భవిష్యత్తులో ఆయిల్ ధరలు కూడా పెరగనున్నాయని ఆమె తెలుపుతూ యుద్ధంలో ఇరాన్ పైచేయి సాధించే అవకాశం ఉందన్నారు. మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మి నారాయణ, నాగండ్ల దీపక్ చౌదరి, మానుకొండ రాధాకిషోర్, కట్ల రంగారావు, వడ్డెబోయిన నర్సింహారావు, వీరబాబు, మిక్కిలినేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ శాంతిని విచ్ఛిన్నం చేస్తున్న సామ్రాజ్యవాదులు

**(మొదటిపేజీ తరువాయి)** నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో మానవహారం చేపట్టి ఖాళీ సిలెండర్లతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నా కేంద్ర ప్రభుత్వం మౌనపాత్ర పోషించడం శోచనీయమన్నారు. భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు నావికా విన్యాసాలకు వచ్చి వెళుతున్న ఇరాన్ నౌకను దేశ సముద్ర తీరంలో అమెరిగా నిట్టనిలువునా కూల్చివేస్తే కేంద్రం కనీసం ఖండించక పోవడం శోచనీయమన్నారు. 160 మంది చిన్నారులను బలి తీసుకున్నప్పుడు అమెరికాకు మోకరిల్లి నోరుమెదపకపోవడం సార్వభౌమాధికారానికి భంగమని మండిపడ్డారు. దేశ ప్రయోజనాలను అగ్ర రాజ్యానికి తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రప్రభుత్వ వైఫల్యాలతో సామాన్యునిపై ధరల భారం పెరుగుతోందని, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల వంటింటిపై మోయలేని భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నా కేంద్రం పట్టించుకోక పోవడం దురదృష్టకరమన్నారు. కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ సామాన్యుని నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ధరల పెరుగుదలను నియంత్రించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పాలకులు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సామ్రాజ్యవాద దేశాలు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలన్నీ ఏకమైన తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, భుక్య శ్రీనివాస్, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సిపిఐ సంఘాల నాయకులు ఎం ధనలక్ష్మి , కే రత్నకుమారి, నిర్మల, గోపికృష్ణ, పి ధనలక్ష్మి, ధర్మరాజు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ఆకాంక్ష, వాడే రాములు, మంద నాగలక్ష్మి , సత్యనారాయణ మూర్తి, విజయలక్ష్మి , యూసఫ్, షాహీన్, కైసర్, అబ్బులు, రాకేష్, సింగరాల రమేష్, లక్ష్మీ నారాయణ, మండల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**- జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తల్లాడ మండలం మల్లారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కె. కిరణ్‌కుమార్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ బిసి హాస్టల్ భవనంలోకి మార్చాలని కోరుతూ దరఖాస్తు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక నుంచి ఖమ్మం మూడవ టౌన్ ప్రాంతం గాంధీచౌక్‌లో ఉన్న ఈద్గాను మరమ్మతులు, గోడ నిర్మాణం చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు, వైరా మండలం కొష్టాల గ్రామానికి చెందిన వార్డు సభ్యులు వి. సాంబయ్య గ్రామ సర్పంచ్ తన ఇష్టానుసారంగా నర్సరీ మొక్కలను పెంచుతున్నారని గ్రామానికి నష్టం జరుగుతుందని నివారించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను ఆయా శాఖల అధికారుల సత్వరమే పరిష్కారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక విద్యావిధానం దివ్యాంగులకు వరం



**(మొదటిపేజీ తరువాయి)** సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా మెరుగైన మౌళిక సదుపాయాలతో రూపొందించిన పురోగతి పనులను పరిశీలించారు. వాల్ పెయింటింగ్, బలహీనమైన పిల్లలకు ఫిజియోథెరపీ, వినికిడి స్పీచ్ థెరపీ మిషనరీ, కృత్రిమ పరికరాలతో అక్కడ విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు మెరుగుపర్చాలని, వివిధ బోధనా ఉపకరణాలతో నాణ్యమైన విద్యను అందించి వారి మానసిక అభివృద్ధికి కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. భవిత విద్యాసంస్థల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. అనంతరం మండల పరిదిలోని చిన్న మునగాల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే ఎప్రీచైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును అకస్మికంగా తనిఖీ చేశారు. రెండు, మూడు తరగతి గదులలో విద్యార్థులను ఇంగ్లీష్ అక్షరాలు, పదాల ఉచ్చారణను చదివించారు. అదే ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు క్రమం తప్పకుండా పౌషికాహారం, కోడిగ్రుడ్లు అందించాలని సిబ్బందికి సూచించారు, రికార్డు పుస్తకాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో సిఎంఒ ప్రవీణ్‌కుమార్, విద్యాశాఖ ఇఇ బుగ్గయ్య, కొణిజర్ల మండల విద్యాశాఖాధికారి అబ్రహాం, హెడ్‌మాస్టర్ నాగమల్లేశ్వరరావు, ఏఈఓ సురేష్,సర్పంచ్ పూనాటి బాబూరావు, ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధాలతో విధ్వంసం.. ఆర్థిక అస్థిరత




**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల**

ప్రజాపక్షం/చింతకాని : పశ్చిమాసియాలో ఉద్రిక్తలు రోజు రోజుకూ అధికమవడంతో పాటు సామాన్యులను వేధిస్తున్న గ్యాస్ సిలిండర్ల కొరత తప్ప సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం చింతకాని మండల సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యుద్దాల వల్ల కేవలం విధ్వంసం, ఆర్థిక అస్థిరత, సామాన్య ప్రజలకు కష్టాలు తప్ప ఏమి రావని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు శాంతియుత మార్గాల్లో దౌత్యపరమైన చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలే తప్ప ఘర్షణలను ప్రోత్సహించ కూడదని ఆయన హితవు పలికారు. యుద్దానికి వ్యతిరేకంగా.. పెరుగుతున్న ధరలకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ప్రజాస్వామ్య శక్తులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమాసియా పరిస్థితులపై మోదీ సర్కారు వైఖరిపై ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ఇరాన్ మధ్య ఉన్న సుదీర్ఘ దౌత్య సంబంధాలను, స్నేహాన్ని గౌరవించాల్సిన భాధ్యత కేంద్రంపై ఉందని.. మౌనం సరైన సంకుతం కాదని ఆయన అభిప్రాయ పడ్డారు. మండలంలో పార్టీ పిలుపు మేరకు కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఏఐవైఎఫ్ మండల మహాసభ నిర్వహణ, భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో జిల్లా కారవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జున్‌రావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, నాయకులు కొల్లి రవి, గోగుల ఆది, పదిమల వెంకటనర్సయ్య, గునుగుంట్ల వెంకన్న, గోపి , షేక్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ల కొరత నివారించాలి

**సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు**



ప్రజాపక్షం/చింతకాని : గ్యాస్ సిలిండర్ల కొరతను నివారించడంతో పాటు నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించాలని సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ చింతకాని మండల పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల ప్రభావం దేశీయ మార్కెట్‌పై పడుతున్నదని పేర్కొన్నారు. ఈ నేపధ్యంలో గ్యాస్ సరఫరాలో కొరత ఏర్పడినట్లు సమాచారం వస్తున్నప్పటికీ , కొందరు దళారులు ఈ పరిస్థితిని మరింత ఎక్కువగా చూపిస్తూ బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు విక్రయిస్తూ సామన్య ప్రజలను దోపిగీ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్యాస్ సిలిండర్ల సరఫరాను సమర్థవంతంగా నిర్వహించి కొరతను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సమస్యపై గిర్దావర్లు జగదీష్, ఏకవీరలకు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, మండల సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, సభ్యులు దొబ్బల వెంగళరావు, కొల్లి రవి, పదిమల వెంకటనర్సయ్య, గోగుల ఆది, గునుగుంట్ల వెంకన్న, దస్తగిరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలరే కార్మికుడైన వేళ..

**- స్వయంగా పారపట్టి, గుంతలు పూడ్చిన సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు**
**- అభినందిస్తున్న స్థానికులు**





ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు ముందుండాలని చెబుతుంటారు. ఇప్పుడు ఆ మాటకు వన్నె తెచ్చారు 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు. ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 28,29వ వార్డులోని మారుతీనగర్ నుంచి వెంకటసుధానగర్ వరకు రహదారిలో మిషన్ భగీరథపైప్ లైన్ పనుల వల్ల ఏర్పడిన గుంతలతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన కౌన్సిలర్ దండి రంగారావు సిపిఐ నాయకులు, యువజన సంఘం సభ్యులతో కలిసి స్వయంగా పారపట్టి సిమెంట్, కంకరతో గుంతలు పూడ్చి ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కలిగించారు. కౌన్సిలర్ స్వయంగా కార్మికుడిలా పని చేయడం చూసి స్థానికులు అభినందనలు తెలియజేశారు. అలాగే ఆయనతో పాటు సిపిఐ నాయకులు, యువజన సంఘం సభ్యులు చేసిన పనులపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల పక్షాన కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ అండగా ఉంటారనే నిర్వచనాన్ని నిజం చేసింది. ఈ కార్యక్రమంలో 29వ డివిజన్ సిపి సెక్రటరీఏఐవైఎఫ్ సెక్రటరీ మిరియాల నరుణ్‌తేజ్, యువజన సంఘం సభ్యులు రెబ్బగొండ్ల గోపి, చింతల ఉదయ్, చింతల బన్నీ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# కూలినే సర్పంచ్ అయితే?

**- పారపట్టి పారిశుద్ధ్య పనులు చేసిన సర్పంచ్ రమాదేవి**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : కూలిగా పని చేసిన వ్యక్తి సర్పంచ్ అయితే? ఆమె చూపే తపన వేరుగా ఉంటుందని మరోసారి రుజువైంది. ఆరెకోడు గ్రామ సర్పంచ్ ఆరెంపుల రమాదేవి 99రోజుల ప్రణాళికలో భాగంగా స్వయంగా పారపట్టి సోమవారం కార్మికులతో కలిసి పని చేసింది. పదవి ఉన్నా పనిని చిన్నచూపు చూడకుండా ముందుండి పని చేయడం గ్రామస్తులను ఆకట్టుకుంటుంది. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ప్రజలు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు ముందుండి పనిచేయడం వలన ప్రజలు ప్రేరణ పొందుతారని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలిచ్చిన ఆశీర్వదానికి చేపట్టిన పనిపై వారి నుంచి ప్రశంసలు అందుకుంటోంది.

# చైర్‌పర్సన్ లేకున్నా..లైట్, ఫ్యాన్..!

**- క్లిక్కుమనిపించిన ప్రజాపక్షం**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీలో చైర్ పర్సన్ పోకబత్తిని అనిత చాంబర్‌లో ఎవరూ లేకపోయినా లైట్, ఫ్యాన్ ఆన్‌లో ఉండటం గమనార్హంగా మారింది. అవసరం లేకపోయినా విద్యుత్ పరికరాలు కొనసాగడం వల్ల విద్యుత్ వృథా అవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో ఎవరూ లేని సమయంలో కూడా లైట్, ఫ్యాన్ అలాగే ఆన్‌లో ఉండటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు విద్యుత్‌ను ఆదా చేయాలని సూచించే అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యాలయాల్లోనే ఈ విధమైన నిర్లక్ష్యం కనిపించడంపై ఆశ్చర్యానికి గురిచేస్తోందని వారు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ దృశ్యాన్ని ప్రజాపక్షం సోమవారం తన కెమెరాలో క్లిక్కుమనిపించింది.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో పీపుల్స్ మార్చ్ వేడుకలు



ప్రజాపక్షం/ మధిర : తెలంగాణ ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టి మూడేళ్ల పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్త మాట్లాడుతూ 2023 మార్చి 16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని బజారహత్నూర్ మండలం పిప్పిరి గ్రామం నుంచి సిఎల్పీ నాయకుడిగా ప్రారంభించిన పాదయాత్ర ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు 1364కి.మీ సాగిందన్నారు. ఈ ప్రయాణం కాంగ్రెస్ పార్టీపై నమ్మకం, విశ్వాసం, భరోసా పెంచి తెలంగాణలో ప్రజల ప్రభుత్వం ఏర్పడేందుకు మార్గం సుగమం చేసిందన్నారు. పాదయాత్రలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలు ప్రత్యక్ష్యంగా చూసిన సందర్భంలో ఇచ్చిన హామీలే నేడు సుపరిపాలనకు తొలి అడుగులుగా మారాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే భట్టివిక్రమార్క లక్ష్యమని, ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించటం కోసం భట్టివిక్రమార్క ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత, వైస్‌చైర్మన్ కోన ధనికుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణమండపంలో సోమవారం పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా కళ్యాణ మండప అధ్యక్షులు కురువెళ్ల కృష్ణ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి నాళ్ళ శ్రీనివాసరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు దాచేపల్లి ముత్యాలరావు, వనమా వేణుగోపాలరావు, చారుగుండ్ల నర్సింహామూర్తి, వాసవి క్లబ్ అధ్యక్షులు దాచేపల్లి ముత్యాలరావు, మిరియాల రమణగుప్తా, కుంచం కృష్ణారావు, కపిలవాయి జగన్మోహన్‌రావు, చేడే రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

**తుంబూరు దయాకర్‌రెడ్డి**





ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దక్షతతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయని మంత్రి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మంరూరల్ మండలంలోని కస్నాతండాగ్రామంలో నూతనంగా ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకున్న జ్వాల రమేష్‌నాగమణి దంపతుల గృహ ప్రవేశానికి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి తరుపున పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పేదలకు పక్కా గూడు కల్పించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మొదటి విడతలో ఇచ్చిన ఇండ్ల కంటే డబల్ ఇండ్లను మంత్రి ఇవ్వనున్నారన్నారు. గ్రామాలలో అర్హులైన వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారుల ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్కడి నుంచి సర్పంచ్ బానోత్ పాపతో కలిసి నేరుగా పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. పంచాయతీలో ప్రజల కోసం ఏర్పాటు చేసిన సేవలను ప్రశంసించారు. కార్యాలయంలో ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగరాజు, పాలకవర్గ సభ్యులు ఏ. విజయ, టి. మధు. బి. నాగేశ్వరరావు, ఏ. స్వరూప, కృష్ణ, మారెమ్మగుడి డైరెక్టర్ అజ్మీర వెంకన్న, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉపేంద్ర, వెంకన్న, పార్వతి, నాగేశ్వరరావు, చంద్రయ్య, వీరన్న, వెంకన్న, చిట్టి, సోమ్లా, ఉపేందర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలోని 21వ వార్డులో రంజాన్ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫాను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్త, వార్డు కౌన్సిలర్ రంగా రూపశ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేయటం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు ఎంతో భక్తిశ్రద్ధలతో పాటిస్తారని, అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కోట నాగరాజు, ముస్లిం మత పెద్దలు షేక్.బాబు, షేక్.నాగుల్‌మీరా, బడేమియా, జానీమియా, బేగం, జాన్‌బీ, తారబీ, మున్ని, షేక్.బాషా, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు మొద్దు నిద్ర వీడాలి

**-ముందస్తు అడ్మిషన్లపై చర్యలు ఏవి...? : ఏఐఎస్ఎఫ్**



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో విద్యా సంవత్సరం పూర్తి కాక ముందే కొన్ని ప్రైవేటు కార్పోరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లను ప్రారంభిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. ఖమ్మం జిల్లా విద్యాశాఖ మొద్దు నిద్ర వీడి ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ అడ్మిషన్లు పూర్తయ్యాయని విద్యా సంస్థలే ప్రకటిస్తున్నాయని అయినా అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యను వ్యాపారం చేస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్న విద్యా సంస్థలకు సంబంధించి విద్యాశాఖాధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు తావిస్తుందన్నారు. ముందస్తు అడ్మిషన్లు నిర్వహించే సంస్థలపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బుర్రా మనోజ్, ఆకాష్, పవన్, గోపి, నరేందర్, లోకేష్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బాలింతలకు పౌష్టికాహారం అందించాలి

**- 28వ వార్డ్ సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రసవం అనంతరం తల్లి ఆరోగ్యంతో పాటు శిశువుకు పెరుగుదలకు బాలింతలకు సరైన పౌష్టికాహారం అందించడం చాల అవసరం అని 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు అన్నారు. సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని 29వ డివిజన్‌లో గల అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సరైన ఆహారం తీసుకుంటే తల్లి త్వరగా కోలుకోవడంతో పాటు శిశువుకు అవసరమైన పోషకాలు పాల ద్వారా అందుతాయి అన్నారు. బాలింతలు ప్రతిరోజూ పాలు, గుడ్ల, పప్పు ధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు వంటి పోషకాలు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే ముఖ్యంగా ఐరన్, కాల్షియం, ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గి శరీరానికి బలం పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లులకు పోషకాహారం అందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, బాలింతలు పాల్గొన్నారు.

## గౌడ జన హక్కుల పోరాట సమితి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/ తల్లాడ :** ఖమ్మం జిల్లా తల్లాడ గ్రామంలో తల్లాడ మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన గౌడ సంఘ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం తల్లాడ మండల గౌడ జన హక్కుల పోరాట సమితి(మోకు దెబ్బ) కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా గుండ్ల నాగేశ్వరరావుగౌడ్, ఉపాధ్యక్షులుగా గుండ్ల వెంకటేశ్వర్లు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మొక్క కృష్ణార్జున్ గౌడ్, కార్యదర్శిగా బొడ్డు సత్యంగౌడ్, అధికార ప్రతినిధిగా నాశగాని సురేష్ గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బొడ్డు వెంకటేశ్వర్లు గౌడ్, సమ్మెట రామకృష్ణ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొడ్డు శ్రీను గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బండి నాగేశ్వరరావు గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దావా ముత్యాలరావుగౌడ్, కొణిజర్ల మండలం అధ్యక్షులు పెద్దప్రోలు నాగేశ్వరరావు గౌడ్, మోకు దెబ్బ నాయకులు బొమ్మగాని హన్మంతరావుగౌడ్ అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లాడ మండలంలోని గౌడ సోదరులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, అందరూ ఐక్యంగా ఉండి మన హక్కులు కోసం పార్టీలకతీతంగా పోరాడాలని అన్నారు. బండి నాగేశ్వరరావుగౌడ్ మాట్లాడుతూ మీపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గౌడ హక్కుల కోసం గౌడ జాతి పరిరక్షణ కోసం గీత వృత్తిలో అనేక రకాలైన లోటుపాటులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి కావాల్సిన సహాయాన్ని అందించేలా కృషి చేయాలని కోరారు.



## గురువులకు మరణం లేదు : ఏలూరి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** గురువంటే కేవలం పాఠాలు బోధించే వారే కాదని జీవితానికి మార్గదర్శిగా ఉంటారని అటువంటి గురువులకు మరణం లేదని టిజివో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయే గురువులలో రాయల వెంకటేశ్వర్లు ఒకరని ఆయన అన్నారు. ఇటీవల మరణించిన రాయల వెంకటేశ్వర్లు సంతాప సభలో ఏలూరి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని కేవలం జీవనోపాధిగా కాకుండా జాతి నిర్మాణానికి అంకితమై పనిచేసిన అరుదైన వ్యక్తి అన్నారు. కామంచికల్, జానంపేట, గేటుకారేపల్లి తదితర చోట్ల పనిచేసిన ఆయన అత్యుత్తమ విద్యార్థులను తయారు చేశారని ఆయన తెలిపారు. సమాజంలో అనేక మంది రాయల వెంకటేశ్వర్లు శిష్యులు వివిధ రూపాల్లో సేవలు అందిస్తున్నారని ఆయన అన్నారు. రాయల వెంకటేశ్వర్లు చిరస్మరణీయుడని ఆయన ఎందరికో స్ఫూరిగా నిలుస్తారని ఏలూరి తెలిపారు. వై. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో వివిధ సంఘాల నేతలు ఎం. వేలాద్రి, శేషు, కందుల వెంకటనర్సయ్య, తాళ్లూరి శ్రీకాంత్, కట్టా శేఖర్, తాళ్లూరి వేణు, ఎన్. కృష్ణమోహన్, రాయల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని రైతు సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతు రైతుసంఘం ఆధ్వర్యంలో స్వర్ణ సుబ్బారావు, ఎస్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడని సమస్యలను పరిష్కరిచాలని అన్నారు. వాటిలో సాదాబైనామా భూముల సమస్యలు, రైతుసదస్సుల్లో రైతులు సమర్పించిన ధరఖాస్తులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సాదాబైనామాలకు సంబందించి దాదాపు 9 లక్షల 50 వేల ధరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించారని వాటికి ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని అన్నారు. సాదాబైనామాద్వారా కొనుగోలు చేసినేటివరకు వ్యవసాయం చేసుకుంటున్నా పాసుపుస్తకాలు లేకపోవడంతో ఆరైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ సురేష్, ఆర్ రాజబాబు, బి వెంకటేశ్వర్లు, ఏ కృష్ణయ్య, ఎస్కె అబ్దుల్ రోషన్, ఎస్కె మీరా, ఎస్కె మల్సూర్, ఎం జాకోబ్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నర్సయ్యకు ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల పరిధిలోని గంగిదేవిపాడు గ్రామానికి చెందిన సత్తెనపల్లి నర్సయ్యకు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు అతనికి తల్లాడ, వైరా, తిరువూరు విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు, తల్లాడ మం డల విశ్వ బ్రాహ్మణ అధ్యక్షులు రుద్రాక్ష నరసింహాచారి ఆధ్వర్యంలో సోమవారం ఆకుటుంబానికి చేయూతగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.16,116 ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉల్లి శ్రీనివాసరావు, బండారు భాస్కరాచారి, కొక్కొండ వీరభద్రచారి, సత్యం, విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఆశా వర్కర్ల పెండింగ్ బకాయిలను చెల్లించాలని సోమవారం తల్లాడ మండల ఆరోగ్య కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సత్తెనపల్లి నరేష్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలు పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను వారికి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని, అంతేకాకుండా వారికి రూ.18వేలు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, సెలవు రోజుల్లో వేతనంగా కూడిన పనులు కేటాయించాలని తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు తగిన న్యాయగం చేయాలని, లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు టి.రాణి, జి.దేవకరణ. పి.నాగమణి, శాంతమ్మ, బి.శ్యామల, పి.సరిత తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లా కేంద్రంలోని పోలీసు పిల్లల కోసం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలో సోమవారం ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ నిష్కాశర్మ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, బిన్నత్వంలో ఏకత్వానికి మన భారతదేశమే నిదర్శనమన్నారు. ఉగాది, రంజాన్ పండుగల విశిష్టతను విద్యార్థులకు ఈసందర్భంగా ఆమె తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ఖర్జూర పండ్లు, ఉగాది పచ్చడి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసిపి నర్సయ్య, ఆర్ఐ కామరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజల మనిషి అనంతరామయ్య



**ప్రజాపక్షం/కొణిజర్ల :** యాసా అనంతరామయ్య నిత్యం ప్రజల మధ్యలో ఉంటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేసి ప్రజల మనిషిగా నిలిచిపోయాడని సిపిఎం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలో సిపిఎం వ్యవస్థాపకుడు యాసా అనంతరామయ్య 9వ వర్థంతి కార్యక్రమం సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతు పట్వారీగా విధులు నిర్వహిస్తు, ప్రజాసమస్యలను పరిష్కరిస్తు సిపిఎం పార్టీని బలోపేతం చేశాడని కొనియాడారు. గ్రామంలోని దళితులు ఊరికి దూరంగా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి మెయిన్‌రోడ్డు ప్రక్కన స్థలం కొని దళితులకు ఇండ్లస్థలాలు ఇచ్చి పక్కా ఇండ్లను సైతం నిర్మించి ఇచ్చి దళితులను ఊరి మొత్తల్లోకి తెచ్చిన ఘనత ఆయనదని అన్నారు. గ్రామంలోని గిరిజనులకు ఒక్కొక్కరికి అర ఎకరం భూమిని పంచి ఇచ్చారని అన్నారు. గ్రామంలోని నిరుపేదలకు ప్రభుత్వం నుంచి సబ్సీడిపై గేదెలు, కూరగాయల వ్యాపారులకు బ్యాంకు రుణాలు ఇప్పించి వారు ఆర్థికంగా బలపడేందుకు సహాయపడ్డాడని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా నారాయణ, చింతనిప్పు సూర్యం, వేముల సాంబశివరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, యాసా జగ్గారావు, సిపిఐ గ్రామ, మండల కార్యదర్శులు యాసా వెంకటేశ్వరరావు, గడల భాస్కర్‌రావు, కొణపర్తి విష్ణుమూర్తి, జోనెబోయిన నరసింహారావు, అనంతరామయ్య కుమారుడు తిలక్, కోడలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి వారి హుండీ లెక్కింపు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీలను జిల్లా దేవాదాయశాఖ అధికారి ఆర్. సమత పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. 52రోజులకుగాను రూ.22.63లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ జగన్మోహన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఉప్పల విజయదేవశర్మ, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, మురళీమోహన్‌శర్మ, ఆలయ సిబ్బంది, శ్రీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు పరిష్కరించాలి : ఎస్‌పి



**ప్రజాపక్షం/భద్రాచలం :** పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరిత గతిన పరిష్కరించాలని ఎస్‌పి రోహిత్ రాజ్ సూచించారు. ఈమేరకు సోమవారం నిర్వహించి సమావేశంలోఆయన మాట్లాడారు. న్యాయాధికారులతో సమన్వయాన్ని పాటిస్తూ పాత కతేసుల పరిష్కారానికి పాటుపడాలన్నారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తమ అధికారులకు తెలియజేస్తూ ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు తలెత్తితే డిసిఆర్‌బి అధికాలకు తెలియజేయాలన్నారు. కేసుల ప్రతి అంశాన్ని ఆన్‌లైన్లో నమోదు చేయాలని, అప్‌లోడ్ సమస్యలు ఉంటే వెంటనే ఐటి సెల్‌ను సంప్రదించి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. 5ఎస్ అమల్లో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కేసులకు సంబంధించిన ఫైళ్లను క్రమ పద్ధతిలో అమర్చుకోవాలని సూచించారు. నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేసి బాధితులకు న్యాయం చేయడం కీలకం అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్‌పి ఆదినారాయణ, పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, మణుగూరు డిఎస్‌రి రవీందర్ రెడ్డి, ఇల్లెందు డిఎస్‌పి వెంకన్న బాబు, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాస్, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డిఎఫ్‌ఓ కార్యాలయం ఎదుట పోడురైతుల రాస్తారోకో



**ప్రజాపక్షం/ఖమ్మం :** లక్ష్మీ దేవిపల్లి మండలంలో సాగులో ఉన్న పోడు భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించి, రైతులు సాఫీగా సాగు చేసుకునే వెసులుబాటు కల్పించాలని సిపిఐ లక్ష్మీ దేవిపల్లి మండల కార్యదర్శి ధీటి లక్ష్మీ పతి అన్నారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో పోడు రైతులలు డిఎఫ్‌ఓ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనతరం సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ధీటి మాట్లాడుతూ ప్రభుత్వం పోడుభూములకు పట్టాలు మంజూరు చేసిన నేపథ్యంలో ఆ భూముల్లో సాగుకు అవసరమైన విద్యుత్ కనక్షన్లు పొందేందుకు అటవీశాఖ అధికారులు సానుకూలంగా స్పదించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ శాఖ అధికారులు కనక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ అటవీశాఖ నుండి సాంకేతిక పరమైన క్లియరెన్స్ అంతకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్న రైతుల పరిస్థితి మానవీయ కోణంలో ఆలోచించి తక్షణమే అవసరమైన అనమతులు మంజూరు చేయాలని అధికారులను కోరారు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించి అటవీ అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిఎఫ్‌ఓకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సర్పంచ్‌లు జలీల్ పాషా, లింగయ్య, కాటి లక్ష్మణ్ రావు, ఈసం కృష్ణ, కారం నరేష్, జి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# డిసిసిబి అధికారుల వేధింపులు ఆపండి...!



**-సబ్సిడీ ఇవ్వలేదు.. తామేందుకు కట్టాలి**
**-చావనైనా చస్తాం..కానీ కట్టేది లేదు : గిరిజనులు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రుణాల వసూలు కోసం బ్యాంక్ అధికారులు చేస్తున్న వేధింపులను ఆపాలని గిరిజనులు బ్యాంక్ వద్ద ఆందోళన నిర్వహించారు. నేలకొండపల్లి మండలంలోని మంగాపురతండా కు చెందిన గిరిజనులకు 2018 లో గేదెల పెంపకం కోసం రుణాలు అందించారు. అయితే వాటిని సబ్సీడీ వస్తుందని చెప్పటంతో గ్రామంలో అనేక మంది రుణాలు పొందారు. సబ్సీడీ రాకపోవటంతో లబ్దిదారులు రుణాలు తిరిగి చెల్లించలేదు. దీంతో ప్రస్తుతం డీసీసీబీ అధికారులు రుణాలతో పాటు వడ్డీలు కూడ చెల్లించాలని నోటీసులు జారీ చేసి... జీప్తులు చేస్తామని ఇళ్ల వద్ద కు వస్తున్నారని అగ్రహాం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అగ్రహించిన"గిరిజన రైతులు సోమవారం నేలకొండపల్లి డీసీసీబీ బ్యాంక్ వద్ద ఆందోళన కు దిగారు. మేనేజర్ తో వాగ్వివాదం కు దిగారు. తమకు సబ్సీడీ ఇవ్వలేదని... అలాంటప్పుడు తామేందుకు రుణాలు చెల్లించాలని బాధిత లబ్దిదారులు నిలదీశారు. చావనైనా చస్తాం కానీ కట్టేది లేదని హెచ్చరించారు. మాకు సబ్సీడీ వస్తుందని చెప్పటం వలనే తాము గేదెల రుణాలు తీసుకున్నామని, కానీ బ్యాంక్ అధికారులు మోసం చేశారని ఆరోపించారు. రుణాల విషయంలో తమను వేదిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తాము రుణాలు చెల్లించ లేమని తెల్చి చెప్పారు. అనంతరం స్థానిక డీసీసీబీ మేనేజర్ కు వినతి పత్రం ను అందించారు.

# త్రివేణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ వేడుకలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ దమ్మపేట సెంటర్‌లోని త్రివేణి పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామూర్తి ఆధ్వర్యంలో జి. నరసింహకుమార్, ఎన్‌విఎన్ ప్రభాస్‌లు ముందుగా దేవతా విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సంధర్భంగా గ్రాడ్యుయేషన్‌పై వివరించారు. సర్టిఫికెట్‌లను విద్యార్థులకు అందజేశారు.అనంతరం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళీ క్రిష్ణ, కిడ్స్ ఇంచార్జి కవిత పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూ పంపిణీ



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం, ఎంపీపీఎస్ రేగళ్ల పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు టి సుజాత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ పాఠశాల 48 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూస్ అందజేస్తూ, విద్యార్థులు బాల్యం నుండే, ఆత్మవిశ్వాసాన్ని ఆత్మ బలాన్ని కలిగి ఉండి లక్ష్యం దిశగా ఒత్తిడి లేని సాధన చేయాలని, మహనీయుల జీవితాలు ఎవరివి పూల పాన్పు కాదని, ఇప్పుడున్న సమయంలో చదువుని ఆయుధంగా చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఆ దిశగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. కరకగూడెం మండల ఎంఈఓ గడ్డం మంజుల మాట్లాడుతూ మంచి ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు డాక్టర్ సారంగపాని క్షేత్రస్థాయిలో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ మరియు షూ బహుకరించడం అభినందనీయమని డాక్టర్ సారంగపాణి ని ఆదర్శం తీసుకొని ఇంకా దాతలు ముందుకు రావాలని కోరారు. బట్టుపల్లి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ టి మోహన్ బాబు మాట్లాడుతూ విద్యార్థి వేసుకునే డ్రెస్ వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందని, తన ఆత్మన్యూనత భావాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. రేగళ్ల సర్పంచ్ బాడిశ పార్వతి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడం కోసం మా వంతు సహకారాన్ని అందిస్తామని, వారి అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. అనంతరం డాక్టర్ సారంగపాణి మాదన్న గూడెం ఆదివాసులను సందర్శించి వారికి పోషక విలువలు లోపించడం వల్ల వచ్చే అనర్ధాలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, మల్లేష్, విద్యార్థుల తల్లిదండ్రులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, తిరుపతి రావు, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి వైఖరి వల్లే గ్యాస్ కొరత, అధిక ధర

**- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి**



**ప్రజాపక్షం/చర్ల :** కేంద్రంలోని బిజెపి కారణంగా గ్యాస్ కొరత, అధిక ధరలు పెరిగాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. చర్ల మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమెరికా, ఇజ్రాయేల్ మూకుమ్మడిగా ఇరాన్‌పై దాడులకు పూనకుంటున్నాయని, వెంటనే నిలుపుదల చేయాలన్నారు. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ నియంతగా వ్యవహరిస్తున్నారని, ఏక పక్ష దాడులకు పూనుకుని ప్రపంచ శాంతికి విఘాతం కల్పిస్తూ సంక్షోబానికి కారణం అవుతున్నారన్నారు. గ్యాస్ కొరత తీవ్రతరం కావడంతో పాటు ధరలు పెరగడం వల్ల హోటళ్లు, హాస్టళ్లలో వంటలు కట్టెల పొయ్యిలపై చేస్తున్నారని, ఇదే కొనసాగితే రానున్న రోజుల్లో హోటళ్లు మూతబడే ప్రమాదం ఉందన్నారు. మరో ప్రక్క మధ్య తరగతి ప్రజలు అధిక ధరలు వెచ్చించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణంగా మోడి బాధ్యతారాహిత్యమే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూపా పోతయ్య, సహాయ కార్యదర్శి కోటి ముత్యాల రావు, చల్లా లక్ష్మీ నారాయణ, కోడిరెక్కల రాజారావు, నర్సింహారావు, కూసం దుర్గా ప్రసాద్, నూప రాము, రమణ, వెంకటేశ్వర్లు, సాయి, కృష్ణ, ప్రవీణ్, రాజు, తిప్పాపురం సర్పంచ్ నూప సునీత, ఉప సర్పంచ్ కల్లూరి సీతారాములు తదితురులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరలు తగ్గించాలని రాస్తారోకో



**ప్రజాపక్షం/ములకలపల్లి:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని సీపీఐ మండల కార్యదర్శి మహ్మద్ యూసఫ్ డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు సోమవారం ములకలపల్లి మండల కేంద్రంలో సీపీఐ నాయకులు గ్యాస్ బండలతో రాస్తారోకో నిర్వహించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా వారు కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ మండల సహ కార్యదర్శి నరాటీ రమేష్, ఉప సర్పంచ్ పువ్వాల లలితారావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు అనుముల సాయి, బైరు సాయి బాబు, ఇమ్మానియేట్, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రమాణాలు పాటిస్తే పంటలకు గిట్టుబాటు ధరలు సాధ్యం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు పొందాలంటే నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని బూర్గంపాడు వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్ అన్నారు. సోమవారం బూర్గంపాడు రైతు వేదికలో వ్యవసాయ శాఖ మరియు వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సాగులో పాటించాల్సిన శాస్త్రీయ విధానాలు, పంటల సంరక్షణ, ఎరువుల సరైన వినియోగం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే మార్గాలు వంటి అంశాలపై తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్‌లో పోటీ ఎక్కువగా ఉన్నందున రైతులు నాణ్యతతో కూడిన ఉత్పత్తులను పండించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ రిసోర్స్ పర్సన్ సాయి, వ్యవసాయ విస్తరణ అధికారులు శృతి, వైష్ణవి, పవన్, సౌజన్య, రైతులు మారం శ్రీనివాసరెడ్డి, బెల్లంకొండ రామారావు, భజన పెద్ద నాగం, తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల మధ్యగా వెళ్తున్న 11కేవీ లైన్‌కు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని అంజనాపురం గ్రామంలో ఇళ్ల మధ్యగా ప్రమాదకరంగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను వెంటనే తొలగించి ప్రత్యామ్నాయ మార్గంలో ఏర్పాటు చేయాలని అంజనాపురం గ్రామ పంచాయితీ రెండో వార్డు సభ్యుడు లకావత్ పవన్ నాయక్ విద్యుత్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం భద్రాచలం విద్యుత్ శాఖ ఏడీఈ నరసింహారావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పవన్ నాయక్ మాట్లాడుతూ గ్రామంలో నివాస గృహాల మధ్యగా ఉన్న ఈ హై వోల్టేజ్ విద్యుత్ లైన్ కారణంగా ఎప్పటికప్పుడు ప్రమాద భయం నెలకొంటోందని తెలిపారు. ముఖ్యంగా గాలి, వర్షాలు వచ్చిన సమయంలో విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఈ 11కేవీ లైన్‌ను తొలగించి గ్రామానికి బయట లేదా రహదారి మార్గం వెంట ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరినట్లు చెప్పారు. ఈ అంశంపై స్పందించిన విద్యుత్ శాక అధికారులు త్వరలోనే గ్రామాన్ని సందర్శించి అంచనాలు సిద్ధం చేసి ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు సానుకూల స్పందనపై వార్డు సభ్యుడు లకావత్ పవన్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

# రేషన్‌షాపును తనిఖీ చేసిన అధికారులు

**ప్రజాపక్షం కథనంపై స్పందించిన అధికారులు**
**- పూర్తి స్థాయిలో పరీశీలన చేసి కలెక్టర్‌కు సమగ్ర నివేదికను అందజేయనున్నట్లు వెల్లడి**




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ 28వ వార్డులోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో గల రేషన్‌షాప్‌తో అక్కడి ప్రజల పడుతున్న కష్టాలపై ప్రజాపక్షం దినపత్రిక ఈ బాధలుతీరెదెన్నోడో? అనే కథనం ప్రచురించిన విషయం పాఠకులకు విధితమే. దీనిపై సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సైతం ఫిర్యాదు చేశాయి. అయినప్పటికీ అది మరుగున పడటంతో మంత్రి ఆదేశించిన అమలు శూన్యం అనే కథనాన్ని మరోమారు ప్రజాపక్షం ప్రచురించడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు 28వ వార్డు శాబాదునగర్‌లోని రేషన్‌షాప్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న రేషన్ లబ్ధిదారుల కార్డు నెంబర్లు అడిగి తెలుసుకున్నారు. నెంబర్ల ద్వారా రేషన్ తీసుకుంటున్నారా?లేదా? అనేది తెలుసుకున్నారు. అలాగే రేషన్ బియ్యం స్టాక్‌తో పాటు ఏ బియ్యం ఉన్నది పరిశీలించారు. పూర్తి స్థాయిలో లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి రేషన్ బియ్యం పంపిణీ ఎలా? జరుగుతుందో అభిప్రాయాలు తెలుసుకుని, కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందజేయనున్నట్లు ప్రజాపక్షానికి తెలిపారు. ఎన్నో ఏండ్లుగా పడుతున్న కష్టాలపై అక్షరాలతో వెలుగులోకి తీసుకువచ్చిన ప్రజాపక్షానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమస్య పూర్తిగా తొలగిపోయే వరకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డీటీ విజయ్‌బాబు, రెవిన్యూ ఆర్ఐ ప్రసాద్, జీపీఓలు ఎమ్ కోటేశ్వరరావు, ఎమ్ వీరబాబు, సిహెచ్ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

## కొండవనమాల ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ జరిపించాలి

**కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని కొండవనమాల గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ శీలం వెంకట్రామిరెడ్డి చేసిన అవినీతిపై విచారణ జరిపించాలని కోరుతు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్థులు జి కృష్ణారెడ్డి, ఎం నాగేశ్వరరావు, కొణిజర్ల మాజీ ఎంపిపి గోసు మధు, చెరుకుమల్లి రవి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కొండవనమాల పంచాయతీలో గత 20 సంవత్సరాలుగా ఫీల్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న శీలం వెంకట్రామిరెడ్డి పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని ఈనెల 14 న జరిగిన సోషల్ ఆడిట్‌లో ఆయన చేసిన అవినీతి, అక్రమాలు వెలుగుచేశాయని అన్నారు. 2024 సంవత్సరంలో గ్రామంలోని హరికోట్ల ఆనందరావు చేను నుంచి నెల్లూరు కిషోర్ చేనువరకు రోడ్డుకు ఇరువైపులా 200 మొక్కలను 6 గురితో వేయించాడని మొక్కకు రూ 300 చొప్పున డ్రాచేసి మొక్కలు నాటిన కూలీలకు రూ 140 చొప్పున చెల్లించి మిగిలిన డబ్బులను వారికి సంబందించిన వారు పనిచేసినట్లు చూపించాడని తెలిపారు. గ్రామంలో ఇంకుడు గుంతలు తీయించి వారికి డబ్బులు ఇవ్వలేదని అన్నారు. చెరువు దగ్గర జెసిబితో పనిచేయించి జాబ్ కార్డులు ఉన్నవారితో పనిచేసినట్లుగా మస్టర్స్‌లో సంతకాలు చేసుకొని సుమారు రూ 5 లక్షల 80 వేలు డ్రాచేసుకున్నట్లు ఆరోపించారు. జాబ్ కార్డులు ఇష్టం ఉన్న వ్యక్తులకు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కావున జిల్లా కలెక్టర్ ఈవిషయంపై విచారణ జరిపి ఫీల్డ్ అసిస్టెంట్ పై విచారణ జరిపి అక్రమంగా కాజేసిన సొమ్మును తరిగి రికవరీ చేయించాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ పాత్ర కీలకం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సేవాదళ్ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్ అన్నారు. సోమవారం కొత్తగూడెం పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్రలో సేవాదళ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. దేశ భక్తి, క్రమ శిక్షణ, సేవా భావాలను పెంపొందించే వేదికగా సేవాదళ్ పని చేస్తోందని తెలిపారు. సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరగా ఉండే సంస్థగా సేవాదళ్ గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని సంస్థను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు జెబి గౌరి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్‌జెకె అహ్మద్, జిల్లా అధ్యక్షులు కేసబోయిన నరసింహారావు, అశ్వారావుపేట నియోజకవర్గ జనరల్ సెక్రటరీ ఎండి ఫజల్, చంద్రుగొండ మండల అధ్యక్షులు బుంగశ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కరకగూడెం మండల సర్పంచ్‌ల సంఘం కమిటీ

**కరకగూడెం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా సోలం కేశవరావు**
**సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులుగా కల్తీ విజయ్ కుమార్**



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం గ్రామ పంచాయతీల లోని సర్పంచుల సంఘం కమిటీ కొరకు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కరకగూడెం మండలానికి సర్పంచ్‌ల సంఘం ఎటువంటి ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా సోలం కేశవరావు, ఉపాధ్యక్షులుగా కల్తీ విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు సోలం కేశవరావు మాట్లాడుతూ సర్పంచులకు ఎటువంటి సమస్యలు ఉన్న వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలిపారు, ఈ సంఘం యొక్క ప్రధానంశం మండలంలో ఆపదలో ఉన్న పేదలకు సర్పంచుల సంఘం తరుపున మా వంతు సహాయ సహకారాలు అందిచడం జరుగుతుందన్నారు.

## డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి ఐసిఎస్‌ఎస్‌ఆర్ ప్రాజెక్టు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న టి. అరుణకుమారికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ నుండి ప్రతిష్టాత్మకమైన మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ మాంజూరైనది. ఈ సంధర్భంగా అద్యాపక బృందం ఆమెను అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ పోలారపు పద్మ మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థులు హిందీ భాష అభ్యాసనంలో ఎదురయ్యే సవాళ్లు, వాటి పరిష్కారాలు, బహూభాషా, సామాజిక సాంస్కృతిక అద్యయనం అనే ప్రాధాన్యమైన అంశంపై అడ్డంకులను విశ్లేశించి, వాటికి తగిన పరిష్కార మార్గాలను చూపడమే పరిశోధన లక్ష్యమన్నారు. గిరిజన ప్రాంతాలలో విద్యాభివృద్ధికి, భాషా బోధనలో నూతన విధానాలు తీసుకురావటంలో ఈ పరిశోధన కీల పాత్ర వహించనుందని విద్యావేత్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు .జాతీయ స్థాయి ప్రతిష్టాత్మకమైన ఐసిఎస్‌ఎస్‌ఆర్ ప్రాజెక్ట్ మంజూరు చేయటంతో పాల్వంచ డిగ్రీ కళాశాల విద్యా ప్రతిష్టను మరింత పెరిగిందని అన్నారు. దీనితో జిల్లాలో విద్యారంగానికి గొప్ప గుర్తింపు లభించినదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జే. మాధవి, డి. రమేష్, కొండలరావు, వేముల కామేశ్వరరావు, స్వరూపరాణి, విజయప్రసాద్, పొట్లపువ్వు శ్రీనివాస్‌రావు, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు,ఎన్. శ్రీదేవి, నియాజ్ ఫర్వీన్, టి. రమేష్, లీలా, సౌమ్య, బి. రమేష్, విమల, హారిక, వకుల ధర్మారావు, రాజ్ కుమార్, బాబ్జి ఖాన్, కరీమా, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాముల వారి పెళ్లికి రండి

**- పిఓని ఆహ్వానించిన ఇఓ**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈనెల 27న భద్రాచలం పుణ్యక్షేత్రంలో జరిగే శ్రీరామ నవమి, ఆ మరుసటి రోజు నిర్వహించే పట్టాభిషేక మహోత్సవానికి సతీ సమేతంగా రావాలని కోరుతూ ఐటిడిఏ పిఓ రాహుల్‌ను దేవస్థానం కార్యనిర్వాహణాధికారి దామోదర్ రావు సోమవారం పిఓ ఛాంబర్లో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ లోకకళ్యాణార్థం జరిగే రాముల వారి పెళ్లి వేడుక పనులు త్వరిత గతిన పూర్తి చేసి సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక పర్వదినాలు ప్రజల్లో భక్తి, శ్రద్ధ ఐక్యతను పెంపొందిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓఇ భవాని రామకృష్ణ, అమరవాది రామాచార్యులు, ఎస్‌టిజి కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

## పథకాలు అర్హులైన గిరిజనులకు అందించాలి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హులైన గిరిజనులకు ప్రభుత్వం నుండి అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ఆయన పలు ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి విన్నపాలు స్వీకరించారు. అనంతరం పిఓ మాట్లాడుతూ అటవీ గ్రామాల్లో నివశిస్తున్న గిరిజనుల సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ఇక్కడిదాకా వచ్చిన విజ్ఞప్తులు చేస్తుంటారని, అధికారులు కూడా ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను అర్హులకు అందిందుకు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ యూనిట్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కట్ల సంతోష్‌ను సన్మానించిన రేణుకాచౌదరి



**ప్రజాపక్షం/వైరా:** రాజ్యసభ సభ్యురాలు కేంద్ర మాజీ మంత్రి గారపాటి రేణుకాచౌదరి సోమవారం ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైరా మున్సిపల్ నూతన వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు సోదరుడు కట్ల సంతోష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి కట్ల సంతోష్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తానని వైరా మున్సిపాలిటీలో రాజ్యసభ నుంచి నిధులు కేటాయిస్తానని తెలిపారు. కట్ల సంతోష్‌కు మంచి రాజకీయ భవిష్యత్తు ఉందని, యువకుడు ఉత్సాహవంతులు కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా మంచి పేరు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల హామీలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ గుగులోత్ నరేష్, ఆశావర్కర్ యూనియన్ మధిర డివిజన్ కార్యదర్శి రమణ సరోజిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బోనకల్‌లో ఆశా వర్కర్లు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా వారు ఆట్లాడుతూ ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలను నెరవేర్చాలని అన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు మరీదు లీలాకుమారి, నాగన్న, బోయిన రమాదేవి, గుడిద ఉషారాణి, గంగుల విజయలక్ష్మి, వంగల దురాగ, గద్దె తులసి, ఇరుగు యశోద, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రుపాలెంలో పీపుల్స్ మార్చ్ సంబరాలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** నాటి సిఎల్పీనేత, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో మధిర ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు అనుమోలు వెంకటకృష్ణారావు, పంబి సాంబశివరావు, కిసాన్‌సెల్ అధ్యక్షులు తలపురెడ్డి నాగిరెడ్డి, షేక్.జానీబాషా, కడియం శ్రీనివాసరావు, ఎర్రుపాలెం సర్పంచ్ నంద్రు అశ్విని, ఆత్మ కమిటీ డైరెక్టర్లు కంచర్ల వెంకటనర్సయ్య, షేక్.ఇస్మాయిల్, బాణవత్ శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గూడేటి బాబురావు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.